క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఎల్.ఎన్.పేట: కొద్ది రోజులుగా వర్షాలు కురవకపోవటం వల్ల వరి పంట పొలానికి సాగునీరు అందించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో సాగునీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో గ్రామ సచివాలయ వ్యవసాయశాఖ సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండి సాగునీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను ఉపయోగించుకుని, పంటకు నీటి తడులు అందివ్వాలన్నారు. పంట చివరి దశలో ఉన్నప్పుడు నీటి యాజమాన్య పద్ధతులు ఎంతో కీలకమన్నారు. గింజ గట్టిబడాలంటే నీటి అవసరం ఉంటుందన్నారు.

నేడు బైక్ ర్యాలీ

నరసన్నపేట: మండలంలోని మడపాం టోల్‌గేట్ వద్దకు గురువారం ఉదయం పది గంటలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి బుధవారం పిలుపునిచ్చారు. తామరాపల్లి వరకు ద్విచక్ర వాహన ర్యాలీ ఉంటుందన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్ర ఇచ్ఛాపురంలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో శ్రీకాకుళం వైపు నుంచి బస్సు యాత్ర వెళ్లే మార్గంలో మడపాం వద్ద ఘనంగా స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న భవానీ భక్తులు

సారవకోట: మండలంలోని అవలింగి నీలమణి అమ్మవారి తెప్పోత్సవం మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు పురస్కరించుకుని స్థానిక కోనేరులో తెప్పోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల్లో శోభయాత్ర నిర్వహించారు.

ఘనంగా వినాయకుడి విగ్రహ ప్రతిష్ట



వినాయక విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస రూరల్: మండలంలో లొద్దలపేట గ్రామంలో గల సీతారామాలయంలో వరసిద్ధి వినాయక విగ్రహాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ట చేశారు. పొందూరు మండలం తాడివలస గ్రామానికి చెందిన పూజారి వరహాలు దంపతులు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ప్రాణ ప్రతిష్ట చేసి పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సరుబుజ్జిలిలో స్పీకర్ పర్యటన

సరుబుజ్జిలి: మండలంలో గురువారం శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు కొత్తకోట జంక్షన్లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం నిర్మాణ పనులకు, 9.30కు సరుబుజ్జిలి నుంచి కొమనాపల్లి వరకు గల ఆర్అండ్‌బీ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు



సాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

బూర్జ: మండలంలోని చినలంకాం గ్రామంలో షిర్డీ సాయిబాబా మందిరం 67వ వార్షికోత్సవాన్ని ప్రధాన అర్చకులు మండా వెంకటరమణశాస్త్రి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 24 నుంచి 26 వరకు మూడు రోజులపాటు వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రెండో రోజు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. బాబా ఊరేగింపు (నగర సంకీర్తన) ఘనంగా నిర్వహించారు. అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. శివసాయి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి శోభాయాత్ర

రణస్థలం: మండలంలోని జే.ఆర్.పురం, పైడి భీమవరం, కొండములగాం, నగరప్పాలెం, రణస్థలం తదితర గ్రామాల్లో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం దేవీ శోభాయాత్ర పూర్తిచేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల దేవుళ్ల వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



జలుమూరు: కరవంజలో మందులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పాతపట్నం: రొంపివలసలో వృద్ధులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



జలుమూరు: కరవంజలో పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. పలు పంచాయతీల్లో బుధవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. స్పెషలిస్టు వైద్యులు హాజరై రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



పొందూరు: రాపాకలో మందులు అందజేస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట: తెలగవలసలో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు



సారవకోట: కుమ్మరిగుంటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పోలాకి: బెలమరలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య



జలుమూరు: కరవంజలో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



కొత్తూరు: లబ్బలో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మెళియాపుట్టి: పట్టుపురంలో సీమంతాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



నరసన్నపేట: తెలగవలసలో రోగులకు మందులు అందజేస్తున్న పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి విశేష స్పందన



బూర్జ: నీలాదేవిపురంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, ఇదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని నీలాదేవిపురం (నీలంపేట)లో గడపగడపకు మన ప్రభుత్వం కార్య క్రమాన్ని బుధవారం నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. ప్రతీ సచివాలయానికి ముఖ్యమంత్రి రూ.20 లక్షలు నిధులు మంజూరు చేశారని, స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యల విషయంలో పరిష్కారానికి తగిన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తి నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు, స్థానిక సర్పంచ్ జల్లు సిమ్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి ధనలక్ష్మి, మాజీ ఏఎంసీ డైరెక్టర్, మండల కన్వీనర్ల కో ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం..

పాతపట్నం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించే ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని రొంపివలస, రొమదల, పెద్దసున్నాపురం గ్రామాల్లో బుధ వారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరించారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు అందజేయటం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను, వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలకు మాయ మాటలు చెప్పేందుకు గ్రామాల కు వస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులను నమ్మవద్దన్నారు. రొమదల, కాగువాడ మధ్య మహేంద్రతనయ నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో రొంపి వలస, రొమదల గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞత లు తెలిపారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ, మండల సచివాలయ కన్వీనర్ సూర్యం, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ప్రదీప్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కె.అర్జునుడు,ఎం.తాతయ్య, పార్టీ నాయకులు బి.శ్రీరాములు, గేదెల సూర్యం, కర్రి లక్ష్మీనారాయణ, దొర పార్వతీశం, పనుకు మోహన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాతపట్నం: రొంపివలసతో సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని రొంపివలస గ్రామంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.22 లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు గ్రామంలోనే సేవలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్కిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి.. రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నామన్నారు. రైతులకు పంటల బీమా, నష్ట పరిహారం, సబ్సిడీలు అందజేస్తున్నామన్నారు. రైతులకు విత్తనాలు నుంచి కొనుగోలు వరకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్, డీటీ ప్రసాద్, ఏఓ బి.రవికుమార్, ఎంపీపీ దొర సావిత్రమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు ప్రదీప్ పాల్గొన్నారు.



రొంపివలసలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సామాజిక భవనం నిర్మించాలని వినతి

ఆమదాలవలస: నియోజకవర్గంలో 1200 మంది పెన్షనర్లు ఉన్నారని, వారి సంక్షేమం కోసం సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నామని, సామాజిక భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆమదాలవలసలో స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద బుధవారం స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన స్పీకర్.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. సంఘం నాయకులు బొడ్డేపల్లి మోహన్‌రావు, హెచ్.వి.సత్యనారాయణ, బి.సూర్యనారాయణ, షణ్ముఖరావు, బి.నారాయణరావు పాల్గొన్నారు.



స్పీకర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

నిమజ్జనం..

సారవకోట: మండల కేంద్రంలో వర్తక సంఘం, మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవీ విగ్రహ నిమజ్జన కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దుర్గాదేవి విగ్రహాన్ని గ్రామంలో తిరువీధి చేపట్టారు. స్థానిక కోనేరులో నిమజ్జన కార్యక్రమం చేపట్టారు.



నిమజ్జనానికి దుర్గాదేవి విగ్రహాన్ని తరలిస్తున్న నిర్వాహకులు

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: మున్సిపాలిటీలోని పలు ప్రాంతాలకు గురువారం తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగావళి నదితీర గ్రామం కొత్తవలస పంపు హౌస్ వద్ద మోటార్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కుద్దిరాం, వెంకయ్యపేట, లక్ష్ముడిపేట రావికండిపేట తదితర గ్రామాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. మోటార్లు మరమ్మతులు చేపట్టి నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

మబ్బులతో అన్నదాత ఆందోళన



మునగవలస వద్ద కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

ఆమదాలవలస రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన హమూన్ తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల రైతుల్లో ఆందోళన మొదలైంది. ప్రతీ ఏడాది ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టాలు చవిచూస్తున్న రైతులకు ఈ ఏడాది కూడా వరి పంట కోతలకు సమయంలో తుఫాన్ హెచ్చరికలు ఉండటంతో ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది పంట దిగుబడులు అనుకూలంగా వస్తాయని భావించిన సమయంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో కలవరం చెందుతున్నారు. వరి కోతలను రైతులు ప్రారంభం చేసే సమయానికి అల్పపీడనం బలపడితే నష్టాలు తప్పవని అంటున్నారు. మండలంలో జొన్నవలస, మునగవలస, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో తేలికపాటి వరి విత్తనాలు వేసుకోవడం వల్ల పంట కోత దశకు వచ్చింది.

విజయగణపతికి దీపారాధన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయగణపతి ఆలయంలో స్వామివారికి అష్టోత్తర శత దీపారాధనలు బుధవారం జరిగాయి. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యగణేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి భక్తులు దీపాలను వెలిగించారు.

మహాలక్ష్మికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని కోదండరామాలయంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారికి దసరా పూజల అనంతరం వచ్చే ఏకాదశి సందర్భంగా బుధవారం అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు చేసి అలంకరణ చేశారు.

రంగనాథునికి అష్టోత్తర పుస్తకార్చన

శ్రీకాకుళం కల్చరల్: పట్టణానికి చెందిన కాశిని వెంకటేశ్వరరావు రచించిన శ్రీరంగనాథ శరణం పుస్తకాన్ని కడప జిల్లా పులివెందులలోని 16వ శతాబ్దం నాటి రంగనాథస్వామికి అష్టోత్తర పుస్తకార్చనలు బుధవారం నిర్వహించారు. పుస్తకాలను భక్తులకు విరతణ చేసేందుకు ఆలయ అర్చకులు కృష్ణరాజేష్ శర్మ, జయసింహాలకు అందజేశామన్నారు. 108 ఆలయాలను, పంచలింగ క్షేత్రాల విశేషాలను ఆరాధన స్తోత్రాలను పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

సాగునీటికి అవస్థలు



మొక్కలతో పూడికపోయిన మురగడ బట్టి

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలో మురగడ బట్టి పూర్తిగా పూడికపోయింది. దీనివల్ల సుమారు 250 ఎకరాలకు సాగునీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. వరిసాగు సమయంలో కూడా సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. శివారు భూములకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతోంది. పంటలు పొట్ట దశలో ఉన్నాయని, ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

గురుపీఠం ప్రారంభం



గురుపీఠాన్ని ప్రారంభిస్తున్న గురుస్వాములు

ఆమదాలవలస: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణంలో దాతల సహాయంతో నిర్మాణం చేపట్టిన గురుపీఠం, అదనపు గదులను బుధవారం ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త తమ్మినేని విద్యాసాగర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు విరాళాలు అందించారు. దాతలతో ఈ గదులను ప్రారంభించారు. గురుపీఠాన్ని గురుస్వాములు రమణయ్యస్వామి, రామన్నస్వామి, ప్రభాకర్ స్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు అయ్యప్పస్వామి భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

సుందరాపురంలో అగ్ని ప్రమాదం

నరసన్నపేట: మండలంలోని సుందరాపురంలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. బడ్డు సత్యనారాయణ ఇంట్లోనే కిరాణా షాపు నిర్వహిస్తుంటారు. జిరాక్స్ మిషన్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇంట్లో వాళ్లు అప్రమత్తం అయ్యే సరికే మంటలు పెరిగాయి. విలువైన సామాగ్రి, ఫ్రిజ్, జిరాక్స్ మిషన్, ఇతర కిరాణా వస్తువులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న నరసన్నపేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో రూ.3 లక్షలు వరకూ ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.



కాలిపోయిన సామగ్రి